క్లుప్తంగా

గెవి తిమ్మరాయస్వామికి ప్రత్యేక పూజలు


గెవితిమ్మరాయస్వామికి పూజ చేస్తున్న దృశ్యం

రామసముద్రం: మండలంలోని దిన్నిపల్లి సమీపంలోని దిన్నిపల్లి సమీపంలోని అడ్డకొండపై వెలసిన గెవి తిమ్మరాయస్వామి ఆలయంలోఆషాఢమాసం చివరి శనివారం ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్‌బట్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం ఆలయ శుద్ధిచేసి పలు రకాల పుష్పములతో అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు గోవిందా నామస్మరణలతో ఆలయం మారుమ్రోగింది. అలాగే మండల కేంద్రంలోని చెంబకూరు రోడ్డులో ఉన్న శ్రీ శనేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

125 మందికి ఉచిత వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక సుదర్శన్ మెడికల్ షాప్ వద్ద ఉన్న షీఫా క్లినిక్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ ఆధ్వర్యంలో దాత దిలీప్ శంకర్‌రెడ్డి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 125 మంది వివిధ రకాల వ్యాధిగ్రస్థులు క్యాంపునకు వచ్చి ఉచితంగా వివిధ రకాల రక్త పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ అస్రాఖాన్‌తో పాటు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో పని చేసే డాక్టర్ అనూహ్య, డాక్టర్ గాయత్రిలు రోగులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను అందజేశారు.

ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి ఫ్రిడ్జ్ వితరణ

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద నున్న ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి జీవదాతసేవా ట్రస్టు నిర్వాహకులు మంజుల, తిప్పన్న ఫ్రిడ్జ్‌ను అందజేశారు. శనివారం ఆశ్రమంలో ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకురాలు స్వాతికి అందించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధుల బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. తమవంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిర్ట్స్ కార్యదర్శి హేమశేఖర్, చక్రపాణి పాల్గొన్నారు.

అవయవదాన ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

మదనపల్లె సిటీ: అవయవదానం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వెలుగు సంస్థ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అవయవదాన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లీనాకుమారి నా మరణానంతరం నా అవయవాలు, కణజాలాలను దానం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా ?

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండు లోనికి వెళ్లే మార్గంలో పంచాయతీ వారు కాలువ తీసి వదిలేయడంతో ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా అని ప్రజలు, వాహనచోదకులు ప్రశ్నించారు. సుమారు నాలుగు నెలల క్రితం డ్రైనేజీ ఉండడంతో బస్టాండు లోనికి వెళ్లే మార్గంలో కల్వర్టు ధ్వంసం చేసి వదిలేశారు. ప్రతి నిత్యం బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పంచాయతీ అధికారులు ఏమాత్ర పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర సందర్శన


పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పీలేరు : స్థానిక సీఎస్‌ఆర్ కళాశాల సైన్సు విద్యార్థులు వ్యవసాయ క్షేత్ర సందర్శన చేపట్టారు. శనివారం మండలంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లెలో రైతు రత్నశేఖర్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన 80 రకాల పండ్ల చెట్లును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి, ప్రకృతి వ్యవసాయ విధానంలో తయారు చేసుకునే జీవామృతం, ఘన జీవామృతం, ఇతర ఎరువులైన పంచగవ్య, మీనామృతము, పులిసిన పండ్ల ద్రావణం, పూలద్రావణం, ఆకుల ద్రావణం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి, సీఎస్‌ఆర్ కళాశాల అధ్యాపకులు జ్ఞానశ్రీ, అజిత తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో కుక్కల బెడద

- గొర్రెలను చంపేస్తున్న కుక్కలు
- రోడ్ల వెంబడి వేళ్లే వారిపై దాడులు
- వీధుల్లో తిరగలేక చిన్నారులు, పాదచరులకు ఇబ్బందులు


బస్టాండు సమీపంలో గుంపులుగా సంచరిస్తున్న ఊర కుక్కలు

గుర్రంకొండ: పట్టణంలో గ్రామానికి ఇరువైపులా రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలను పడేస్తున్నారు. ఈవ్యర్థాలను తినేందుకు అలవాటు పడిన కుక్కలు, చివరకు మనిషి రక్తం రుచి మరుగుతున్నాయి. పట్టణ పరిసరాల్లో గొర్రెల మందలపై దాడులు చేసి ఇష్టానుసారంగా గొర్రెలను చంపేస్తున్నాయి. రోడ్ల వెంబడి వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహన దారులపైన విరుచుకు పడుతూ దాడులు నిర్వహిస్తున్నాయి. పలువురు ఈ కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటీవల పలువురు చిన్నారులపై కుక్కలు దాడులు చేశాయి. ఇటీవల గొర్రెలమందపై దాడి చేశాయి. పట్టణంలోని పలు వీధుల్లో ఇళ్లలోనే కోళ్లనుకోసి వాటి వ్యర్థాలను ఇళ్ల పరిసరాలు, మురుగునీటి కాలువల్లో పడేస్తున్నారు. దీంతో వీధుల్లో ఊర కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తుండడంతో చిన్నారులు వీధుల్లో వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు.

రోడ్లపక్కనే కోళ్ల వ్యర్థాలు

పట్టణంలో 18 చికెన్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. చికెన్ అమ్మకాల్లో భాగంగా కోళ్లలోని వ్యర్థాలను దుకాణాల్లో పక్కనే పడేస్తున్నారు. ఈ వ్యర్థాలు, కోడి ఈకలు మొత్తం కలిపి గ్రామానికి వెలుపల దుకాణదారులు పడేస్తున్నారు. కడప-బెంగుళూరు జాతీయ రహదారి, గుర్రంకొండ-గాలివీడు, గుర్రంకొండ- కలకడ మార్గాలలోని రోడ్లపక్కనే ఈ వ్యర్థాలను ఇష్టానుసారం పడేస్తున్నారు. గ్రామంలోని వందలాది కుక్కలు రోడ్డు పక్కనే పడేసిన ఈవ్యర్థాలను తినేందుకు అలవాటు పడ్డాయి. గుంపులు గుంపులుగా అటువైపు సంచరిస్తుంటాయి. కోళ్ల వ్యర్థాలను తిన్న తరువాత అవిచాలక అటువైపు వెళ్లే పాదాచారులపైన దాడులు నిర్వహిస్తున్నాయి. పట్టణం నుంచి పల్లెలకు వెళ్లే మార్గాల్లో కాపుకాచి పాదచారులు, ద్విచక్రవాహనాలపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. ఒంటరిగా గ్రామాల్లో వెళ్లాలంటే జనం హడలెత్తి పోతున్నారు. ద్విచక్రవాహనాల్లో అటువైపు వెళ్లే వాహనదారులను చాలా వరకు వెంబడిస్తూ దాడులు చేస్తున్నాయి.

గొర్రెల మందపై దాడి

నాలుగురోజుల క్రితం గుర్రంకొండ పరిసరాల్లో గొర్రెల మందపై కుక్కల మూకుమ్మడిగా దాడి చేశాయి. కుక్కల దాడిలోరూ. 5లక్షలు విలువచేసే గొర్రెలు, పొట్టేళ్లు మృతి చెందాయి. కాగా 15 గొర్రెలు తీవ్ర గాయాల పాలయ్యాయి. దీంతో గొర్రెల కాపరులు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు కుక్కల దాడులు చేస్తాయోనని కాపాలా కట్టుదిట్టం చేసుకొంటున్నారు.

నెలరోజుల్లో నాలుగుమార్లు దాడులు

గత నెల రోజులుగా పిచ్చికుక్కలు పట్టణంలో నాలుగుమార్లు దాడులు చేశాయి. ఇందిరమ్మకాలనీ, తాళింవీధి, బలిజగడ్డ వీధుల్లో పిచ్చికుక్కలు యథేచ్ఛగా సంచరించి ఇష్టానుసారంగా దాడులకు తెగబడుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటికే 16 మందితోపాటు పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. ఇటీవల వీధిలో ఆడుకొంటున్న మూడేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గతంలో కుక్కల దాడిలో గతంలో ఓ బాలుడు మృతి చెందడగా పలువురు చిన్నారులకు రక్తగాయాలు అయిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి.

ఒంటరిగా వెళ్లాలంటే వణుకు :

వీధుల్లో గుంపులు, గుంపులుగా వీధికుక్కలు, పిచ్చికుక్కలు సంచరిస్తుండడంతో జనంతో పాటు చిన్నారులు ఒంటరిగా వెళ్లాలంటే జంకుతున్నారు. వీధుల్లో ఒంటరిగా వెళ్లే వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. చిన్నారులు ఒంటరిగా కనిపిస్తే కుక్కలు ముకుమ్మడిగా దాడులు చేస్తున్నాయి. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళకు గురవుతున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో కుక్కల బెడద అరికట్టాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

చర్యలు తీసుకొంటాం



పట్టణంలో పిచ్చికుక్కలు, ఊరకుక్కలు సంచారం ఎక్కువగా ఉన్నాయి. జనాలపై దాడులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. గతంలో చాలా వరకు కుక్కల్ని పట్టి బయట ప్రాంతాలకు తరలించారు. మళ్లీ కుక్కల బెడద ఎక్కువగా అవడంతో తగు చర్యలు చేపడతాం.

– విశ్వనాథ్, పంచాయతీ ఈఓ గుర్రంకొండ


కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు (ఫైల్)


గుర్రంకొండ-గాలివీడు మార్గంలో రోడ్డు పక్కనే పడేసిన కోళ్ల వ్యర్థాలు

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శనివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సాంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

– జడ్జి గురు అరవింద్


పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం: సెప్టెంబరు 14న స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమన్నారు. క్షణికావేశంతో గలాటాలు పడడం వలన కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. పోలీసులు, న్యాయవాదులు కలసి కట్టుగా కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పులిశేఖర్, ఏజీపీ అశోక్ కుమార్ రెడ్డి, న్యాయవాదులు రవిప్రకాష్, ద్వారకనాథ రెడ్డి, ఎస్ఐ నాగేశ్వర రావు, ఎఎస్ఐ లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థి రూపశ్రీకి నగదు అందజేస్తున్న ఏసీటీఓ నాగేంద్ర

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బి.రూపశ్రీకి దాతల సహాయంతో రూ.45 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రిపుల ఐటీలో సీటు సాధించిన రూపశ్రీని అభినందించారు. ముఖ్య అతిథిగా ఏసీటీఓ నాగేంద్ర మాట్లాడుతూ పదో తరగతిలో 567 మార్కులు సాధించి ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. తండ్రి లేకపోవడం తల్లి ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా అంకుఠిత దీక్షతో చదువులో రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇందుకు పూర్తిగా సహాయ,సహకారాలు అందించారన్నారు. విద్యార్థి భవిష్యత్తు బంగారుబాట కావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శంకర, పీడీ రాంబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌సీ నాయకుల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

వాల్మీకిపురం: మాదిగ, మాదిగ ఉపకులాల సుదీర్ఘ ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పుపై వాల్మీకిపురంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గంత బాలకృష్ణ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక న్యాయ సిద్ధాంతం అయిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం గత 30 సంవత్సరాల నుండి అకుంటిత దీక్షతో జరుగుతున్న నేపథ్యంలో న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమని, రాష్ట్రాలు వర్గీకరణ చేసుకునే హక్కు ఉందని విస్తృత ధర్మాసనం తీర్పు వెలువరించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్న తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు ముల్లంగి రెడ్డెప్ప, వెంకటరమణ, రవిశ్వరయ్య, శ్రీరాములు, గురవయ్య, నాగేశ్వర, చరణ్ కుమార్, రాజశేఖర్, పెద్ద రెడ్డెప్ప, టిడిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, రాజేంద్రాచారి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరురూరల్ : ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఇరిగేషన్ డీఈఎం. ప్రసన్నకుమారి సూచించారు. శనివారం ఏపీఐఐసీ లేఅవుట్ 1, 2ను పరిశీలించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యం, ఇంటి నిర్మాణాల గూర్చి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజనాయక్, హౌసింగ్ ఏఈ బాలాజి నాయక్, ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు


మాట్లాడుతున్న రెడ్డెమ్మ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు

కలకడ : వ్యవసాయ ఉత్పత్తి దారుల సంఘాలను ప్రభుత్వం గుర్తించి ఆర్థిక వనరులు, రాయితీపై యాంత్రీకీకరణ వస్తువులను అందించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో శ్రీరెడ్డెమ్మ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం 3వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణప్రాంత రైతులు సంఘాలుగా ఏర్పడి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పరుగు మందులు మొదలైనవి సరసమైన ధరలలో అందించడం సంతోషమన్నారు. ఇన్‌పుట్స్‌పై పశువుల దాణాను కూడా అందిస్తుందని గుర్తు చేశారు. ఏపీ మాస్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భార్గవి మాట్లాడుతూ 2023–24 ప్రగతి నివేదిక, 2024–25 ప్రణాళిక గురించి సంఘం డైరెక్టర్‌లు, సభ్యులకు నివేదించారు. వెలుగు ఏపీఎం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెలుగు ద్వారా సేకరిస్తున్న పాలకేంద్రంలో నిణ్యమైన పాలకు అధిక ధర లభిస్తుందని, మహిళల అభివృద్ధికి పాల ఉత్పత్తి చేసే, మహిళలకు ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రతి మహిళకు న్యాయం చేస్తుందని గుర్తు చేశారు. ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది దివ్య, అంబిక, ప్రత్యూష, విష్ణు, శ్రీనివాసులు, పివినాయుడు, పల్లా రెడ్డెప్ప, రాళ్ళపల్లె హరి, అన్నపూర్ణమ్మ, ప్రసాద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రదినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుందాం

- దేశభక్తిని చాటేలా వారంరోజుల ప్రత్యేక కార్యక్రమాలు
- యువతలో స్ఫూర్తిని నింపడమే లక్ష్యం
- నిర్వహణకు ఉత్సవ కమిటీ ఏర్పాటు



స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు కమిటీ ఏర్పాటుపై మాట్లాడుతున్న సభ్యులు

మదనపల్లె : భారతదేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన రోజైన ఆగస్టు 15 ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయేలా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుందామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో స్వాతంత్య్రదినోత్సవ వేడుకల నిర్వహణపై విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.... 14 ఏళ్లుగా ప్రతి సంవత్సరం స్వాతంత్య్రదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. ఈ ఏడాది అదే స్ఫూర్తితో వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా, భారతావని గొప్పదనం దశదిశలా వ్యాపించేలా, స్వాతంత్య్రపోరాటంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకునేలా వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో మదనపల్లెకు ఓ ఘన చరిత్ర ఉందని, దాన్ని భవిష్యత్ తరాలకు తెలపడమే ధ్యేయంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. జనగణమన జాతీయగీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించిన ఘనత మదనపల్లెకే దక్కిందన్నారు. దీంతోపాటుగా అనిబిసెంట్ హోంరూల్ ఉద్యమం, బీటీ కళాశాల తదితర అనేక చారిత్రాత్మక సంఘటనలు మదనపల్లెతో ముడిపడి ఉన్నాయన్నారు. వీటన్నింటినీ గుర్తుచేసి ప్రజలందరిలో జాతీయోద్యమ స్ఫూర్తిని నింపేందుకు కృషి చేస్తామన్నారు. వేడుకలకు పట్టణంలోని ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తలు, విద్యాసంస్థల అధినేతలు, విద్యార్థులు, పురప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉత్సవ నిర్వహణ కమిటీ

స్వాతంత్య్రదినోత్సవ ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా కే.రఘునాథరెడ్డి, కో-కన్వీనర్‌గా రాటకొండప్రసాద్, ఆర్.కేశవరెడ్డి, ట్రెజరర్లుగా ఎం.కృష్ణప్ప, నిర్మల్‌కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటరుగా బండిఆనంద్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్.ఎన్.సేతు, కామకోటిప్రసాదరావు, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీనివాసులు, మీడియా ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరావు నియమితులయ్యారు. అలాగే కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులుగా మహేష్, శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మీ, శ్రీరాములు, ఉదయ్‌భాస్కర్, శ్యామల నియమితులయ్యారు.

7న నాగుల ప్రతిష్ట

మదనపల్లె సిటీ: స్థానిక యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7న నాగుల చవితిరోజున నాగుల ప్రతిష్ట జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు విశేశ్వర ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఉన్న నాగలరాళ్ల ప్రతిష్ట చేసిన ప్రదేశంలో రావిచెట్టు వేర్లు పెరిగిపోవడంతో అవి తమ స్థానంలో సక్రమంగా లేకపోవడంతో భక్తులు ప్రదర్శన చేయడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఇందు కోసం తిరిగి పునః ప్రతిష్ట చేయనున్నట్లు తెలిపారు. భక్తులు నాగుల ప్రతిష్ట కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

నాగులబావిలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సనా అయేషా

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం గండబోయనపల్లి పంచాయతీ నాగులబావి వద్ద వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ సనా అయేషా తెలిపారు. ఈ సందర్భంగా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు తదితర జబ్బులు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి, మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషితం లేని శుభ్రమైన నీరు తాగాలని, నీటిని కాచి చల్లార్చిన తరవాత తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముజీబ్ బాషా, సుధాకర్, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక


తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో శనివారం తిరుపతి శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యుజర్ కంపెనీ ప్రతినిధి రవికుమార్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లకు చెందిన 50 మంది జాబ్ మేళాకు హాజరయ్యారు. వారిలో సామర్థ్యాన్ని బట్టి 25 మందిని ఎంపిక చేశారు. వారికి రూ.25 వేల వేతనం ఇచ్చే విధంగా కాల్ లెటర్స్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, టీఓలు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు తొలి పోషణ

పీలేరు : తల్లిపాలు శిశువుకు తొలి పోషణ అని, బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని హెచ్‌ఈ కొండయ్య అన్నారు. శనివారం స్థానిక మోడల్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి ముర్రపాలలో ప్రోటీన్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని కలిగి ఉంటాయన్నారు. తల్లి పాలు శిశువుకు అత్యంత సహజమైన సురక్షితమైన, పుష్టికరమైన ఆహారమని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు అక్కాయమ్మ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఏఎన్‌ఎం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

కలికిరి: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని సీడీపీఓ భారతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం కలికిరి ఇందిరమ్మకాలనిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలతో కలిసి తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు తల్లిపాలు తాపించాలని, దీంతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు అరుంధతి, రెడ్డి సర్తాజ్ తదితరులు పాల్గొన్నారు.


కలికిరి: తల్లిపాలపై అవగాహన ర్యాలీ

తల్లి పాలతోనే ఆరోగ్యం

పెద్దతిప్పసముద్రం: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని తుమ్మరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. తల్లి పాలకు మించిన తొలి పోషక ఆహారం ప్రపంచంలో ఏదీ లేదన్నారు. మహిళా పోలీస్ పావనితో పాటు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మపాలే అమృతం

తంబళ్లపల్లె: అమ్మపాలే చంటి బిడ్డలకు అమృతంలాంటిదని సీడీపీఓ నాగవేణి అన్నారు. శనివారం తంబళ్లపల్లె-1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమాదేవి, సరస్వతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.